క్లుప్తంగా

కళాశాలను పరిశుభ్రంగా ఉంచుదాం

శ్రీకాళహస్తి: కళాశాలు పరిశుభ్రంగా ఉంచుదామని ప్రిన్సిపల్ నాగరాజునాయుడు అన్నారు. పట్టణంలోని ఎస్వీయే ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణాంధ్రలో భాగంగా గ్రీన్ ఏపీ నిర్వహించారు. అధ్యాపకులు, విద్యార్థులు పరిసరాలను పరిశుభ్రం చేసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటి పచ్చదనం పెంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు సుధీర్, సునీత, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి


మాట్లాడుతున్న ఎంఈఓలు

బుచ్చినాయుడుకండ్రిగ: చదువులో వెనుకబడిన ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎంఈఓలు రవీంద్రనాథ్, మునిసుబ్రమణ్యం అన్నారు. శనివారం మండలంలోని నెలవాయి, బీఎన్ కండ్రిగ, పల్లమాల ఉన్నత పాఠశాలల్లో క్లస్టర్ పరిధిలోని ఉపాధ్యాయులకు మధ్యాహ్నం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫౌండేషన్ పాఠశాలలలో విద్యార్థుల సంఖ్య పెంచాలని తెలిపారు. ఇప్పటికే ఎఫ్ఏ పరీక్షలు పూర్తి కాగా, ఈ విద్యాసంవత్సరం నుంచి సరికొత్తగా విద్యార్థులందరికీ అసెస్మెంట్ బుక్స్ ఇచ్చి పరీక్షలు నిర్వహించాలన్నారు.

ఆక్రమణల తొలగింపు


వరవకాలువ ఆక్రమణలు తొలగిస్తున్న అధికారులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని అరిగిలకండ్రిగ ఆరుంధతివాడ చెరువు వరవ కాలువ ఆక్రమణలను శనివారం తొలగించినట్టు తహసీల్దార్ శ్రీదేవి తెలిపారు. వరవకాలువ ఆక్రమణలను తొలగించాలని సర్పంచ్ సిద్ధమ్మ ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ శ్రీదేవి, సిబ్బందితో కలసి హిటాచీ యంత్రంతో కాలువ ఆక్రమణలు తొలగించారు. కార్యక్రమంలో వీఆర్వో ఈశ్వరయ్య, గ్రామ కార్యదర్శి హేమశ్రీ, కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా తైలాభిషేకం

శ్రీకాళహస్తి: పట్టణంలోని శనీశ్వరస్వామివారికి శనివారం శాస్త్రోక్తంగా తైలాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి నువ్వుల నూనె, పాలు, పెరుగు, చందనం, నారికేళ, కలశ జలాలతో అభిషేకం చేశారు. అనంతరం స్వామివారి విశేషాలంకరణ, విశేష పూజలు చేసి, ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని, స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి ఊరేగింపు


ఊరేగుతున్న ప్రసన్న వేంకటేశ్వర స్వామి

రేణిగుంట: పట్టణంలోని ప్రసన్న వేంకటేశ్వర స్వామి దేవాలయంలో పెరటాసి నెల మొదటి శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున ఆలయంలోని మూలవిరాట్‌కు విశేష అభిషేకాలు చేసి, విశేషాలంకరణ చేశారు. మొదటి శనివారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం భక్తులకు ఆలయ ప్రాంగణంలో అన్నదానం చేశారు. సాయంత్రం స్వామివారి ఉత్సవమూర్తులను మంగళ వాయిద్యాలు, భజనల నడుమ పట్టణ వీధుల్లో ఊరేగించారు. శ్రీ బాలాజీ భక్తి సేవా సంఘం సభ్యులు భక్తులకు ప్రసాదాలు వితరణ చేశారు.

పది విద్యార్థులపై ప్రత్యేక దృష్టి


మాట్లాడుతున్న డీఈఓ కేవీఎస్ కుమార్

రేణిగుంట: పదో తరగతి విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించేలా చూడాలని ఉపాధ్యాయులకు డీఈఓ కేవీఎస్ కుమార్ సూచించారు. రేణిగుంట జెడ్పీ బాయ్స్ హైస్కూల్‌లో శనివారం విద్యాశాఖ అధికారులు క్లస్టర్‌లోని ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. క్లస్టర్ సమావేశాన్ని జిల్లా విద్యాశాఖ అధికారి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవంబర్ 30వ తేదీ లోపల సిలబస్ పూర్తి చేసి, డిసెంబర్ నుంచి కార్యాచరణ రూపొందించాలని సూచించారు. చదువులో వెనుకపడిన సీ, డీ గ్రూపు విద్యార్థులకు జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో తగిన మెటీరియల్ అందిస్తామని తెలిపారు. ఎంఈఓ రంగనాథయ్య పాల్గొన్నారు.

జనం బండీ.. ఇదేమండీ!


కేఎల్‌ఎం హాస్పిటల్ సర్కిల్ నుంచి వెళుతున్న తిరుపతి-పాయల్ సెంటర్ ఆర్టీసీ బస్సు

మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం ఉచితం అన్నారు. అయితే పల్లెవెలుగు సర్వీసులను దారి మళ్లించారు. ఫలితంగా నాలుగు గ్రామాల్లోని మహిళలకు ఉచితం దూరం కాగా.. వృద్ధులు, విద్యార్థులు రాకపోకలు సాగించడానికి ఇక్కట్లు పడుతున్నారు. ఆర్టీసీ సర్వీసులను మళ్లీ పాత దారిలోనే నడపాలని వేడుకుంటున్నారు. జనం బండీ అని చెబుతూ ఇదేమి పనండీ అంటున్నారు.

- దారి మళ్లిన ఆర్టీసీ సర్వీసులు
- నాలుగు గ్రామాల ప్రజలకు ఇక్కట్లు

రేణిగుంట: ఎన్నో ఏళ్లగా నడుస్తున్న ఆర్టీసీ బస్సులను దారి మళ్లించడంతో నాలుగు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆర్టీసీలో ఉచిత సర్వీసు వచ్చిందని సంతోషించే లోపే తమ గ్రామాల్లో ఆర్టీసీ సర్వీసులు నిలిపివేయడం దారుణమని మహిళలు వాపోతున్నారు. రేణిగుంట మండలంలోని రామకృష్ణాపురం, లక్ష్మీపురం, గణేష్ నగర్, మర్రిగుంట మీదుగా తిరుపతి–పాపానాయుడుపేట ఆర్టీసీ బస్సులు నడిచేవని, కానీ గత వినాయక చవితి నుంచి బస్సులు రూట్ మార్చి యోగానంద కాలేజీ నుంచి కేఎల్‌ఎం హాస్పిటల్ మీదుగా నడుస్తున్నాయన్నారు. నాలుగు గ్రామాల ప్రజలు, రెండు విద్యా సంస్థలకు చెందిన విద్యార్థులు ఆర్టీసీ బస్సులు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్టీసీ ఉన్నతాధికారులు చొరవ చూపి, ఆర్టీసీ సర్వీసులను గతంలో లాగే నడపాలని ఆ గ్రామాల్లోని ప్రజలు కోరుతున్నారు.

వృద్ధులు, మహిళలకు తీవ్ర ఇబ్బందులు...



ఆర్టీసీ బస్సులు రాకపోవడంతో ఆస్పత్రికి వెళ్లే వృద్ధులు, పనుల నిమిత్తం మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. మా గ్రామం నుంచి ఒక కిలోమీటర్ దూరం నడిచి వెళ్లి ఆర్టీసీ బస్సు ఎక్కాల్సిన పరిస్థితి నెలకొంది. వృద్ధులు అంత దూరం నడవలేక అవస్థ పడుతున్నారు. ఉన్నతాధికారులు దయవుంచి ఆర్టీసీ బస్సులను మా గ్రామం మీదుగా నడపాలి.

–మణెమ్మ, రామకృష్ణాపురం, రేణిగుంట

దారి మళ్లించడం దారుణం



ఎన్నో ఏళ్లగా మా గ్రామాల మీదుగా ఆర్టీసీ బస్సులు రాకపోకలు సాగించేవి. కానీ ఇప్పుడు దారి మళ్లిచడం దారుణం. నాలుగు గ్రామాల ప్రజలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. గతంలో మాదిరిగానే మా గ్రామాల మీదుగా ఆర్టీసీ బస్సులను నడిపేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి.

–కాంచనమ్మ,రామకృష్ణాపురం, రేణిగుంట

ఘనంగా గొడుగుల ఊరేగింపు


ఊరేగింపులో శ్రీవారి గొడుగులు

నారాయణవనం: తిరుమల మలయప్పస్వామివారికి సమర్పించే గొడుగులను శనివారం సాయంత్రం నారాయణవనం పురవీధుల్లో భజనలు, కోలాటాలు, గోవిందనామ స్మరణల మధ్య ఊరేగించారు. తిరుమల బ్రహ్మోత్సవాలకు తమిళనాడుకు చెందిన రామాణుజ కూటం గొడుగులను గత పదేళ్లుగా సమర్పిస్తోంది. శనివారం సాయంత్రం పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద గొడుగులకు పూజలు చేశారు. అనంతరం మాడవీధులు, నగరి వీధి, ట్రంకు రోడ్డు మీదుగా బైపాస్ సమీపంలోని దూఢి వినాయకస్వామి ఆలయం వరకు ఊరేగింపు కొనసాగింది. గొడుగుల ఊరేగింపులో శివానందస్వామి, కృష్ణచైతన్యస్వామి, స్థానిక ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు, అధిక సంఖ్యలో వెంకన్న భక్తులు పాల్గొన్నారు.

కల్యాణ వెంకన్న ఆలయంలో భక్తుల రద్దీ


ఊంజల్‌సేవలో కల్యాణ వెంకన్న

నారాయణవనం: తమిళ పెరటాశి నెల తొలి శనివారం కావడంతో పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం భక్తులతో పోటెత్తింది. ఉదయం నుంచి రాత్రి ఏకాంత సేవ వరకు భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు అందుకున్నారు. ఉదయం సుప్రభాత సేవతో ఆలయాన్ని తెరిచిన అర్చకులు నిత్యపూజాకైంకర్యాలు పూర్తి చేశారు. తొలిగంట నైవేద్య సమర్పణ అనంతరం 8.45 గంటలకు భక్తులను దర్శనానికి అనుమతించారు. పెరటాసి నెలలో శనివారం వేంకటేశ్వరస్వామివారిని కొలవడం సంప్రదాయంగా కొనసాగుతున్న నేపథ్యంలో ఉదయం నుంచి భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ధ్వజస్తంభం వద్ద పిండి దీపాలు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం తిరుచ్చి వాహనంపై శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామిని కొలువుదీర్చి ఊరేగించారు. ఊంజల్ మండపంలో ఊంజల్ సేవ నిర్వహించారు. ఆస్థానం, రాత్రి గంట అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. రాత్రి 9.30 గంటలకు ఏకాంతసేవ నిర్వహించారు. ఆలయాధికారి నాగరాజు, ఆర్జితం అధికారి భరత్, ప్రధాన అర్చకులు శ్రీధరభట్టాచార్య, శ్రీనివాసభట్టాచార్య, నరసింహరాఘవ భట్టాచార్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఉచిత పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలి


మాట్లాడుతున్న సీడీపీఓ దేవకుమారి

బుచ్చినాయుడుకండ్రిగ: అసంక్రమిత వ్యాధుల గుర్తింపు కోసం మహిళలకు ఉచితంగా నిర్వహిస్తున్న స్క్రీనింగ్ పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలని సీడీపీఓ దేవికుమారి తెలిపారు. శనివారం కాంపాళెం గ్రామ దళితవాడలోని పాఠశాల ఆవరణలో స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్ పథకంపై మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ సెప్టెంబర్ 17వ తేదీ నుంచి మహిళలకు స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్ పథకంలో ఉచితంగా అసంక్రమిత వ్యాధుల గుర్తింపు కోసం ఉచితంగా స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. మహిళలకు రక్తపోటు, మధుమేహం, నోటి, రొమ్ము, గర్భాశయ క్యాన్సర్, క్షయ వ్యాధులను స్క్రీనింగ్ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మాచాలమ్మ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జ్యోతి, మునిరాజా తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న న్యాయమూర్తి బేబీ రాణి

శ్రీకాళహస్తి: మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని శ్రీకాళహస్తి న్యాయస్థాన సీనియర్ సివిల్ జడ్జి బేబీ రాణి అన్నారు. పట్టణంలోని పురపాలక సంఘ కార్యాయలంలో నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో మహిళలకు చట్టాలపై అవగాహన కల్పించారు. న్యాయమూర్తి బేబీ రాణి మాట్లాడుతూ ప్రతి ఒక్క మహిళ ఉపాధి హామీ పథకాలు, మహిళ భద్రత, ఉచిత న్యాయ సేవా చట్టం, వరకట్న నిరోధక చట్టం, బాల్య వివాహాల నిర్మూలన చట్టం గురించి అవగాహన కలిగి ఉండాలన్నారు. మన ఇంట్లో పిల్లలకు మంచి నేర్పించాలని తెలిపారు. ముఖ్యంగా డ్వాక్రా మహిళలకు సంబంధించి కొన్ని కేసులు ఎదురు పడుతున్నాయని, వాటిలో ముఖ్యంగా డబ్బులు విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. అలాగే మీకు ఏదైనా సమస్య ఉంటే అర్జీ రూపంలో ఇస్తే మీకు ఉచితంగానే సేవ అందిస్తారని, అలాగే టోల్ ఫ్రీ నంబర్ 15100 ఉందని తెలిపారు. కార్యక్రమం అనంతరం శ్రీకాళహస్తి సబ్ జైలును పరిశీలించారు. ఖైదీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి కృష్ణప్రియ, మున్సిపల్ కమిషనర్, రెండో పట్టణ సీఐ నాగార్జునరెడ్డి, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, పారా లీగల్ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ


మొక్క నాటుతున్న తహసీల్దార్ శ్రీదేవి

బుచ్చినాయుడుకండ్రిగ: మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ సాధ్యమని తహసీల్దార్ శ్రీదేవి తెలిపారు. శనివారం బుచ్చినాయుడుకండ్రిగలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఎంపీడీఓ మోతి, ఎంఈఓలు రవీంద్రనాథ్, మునిసుబ్రమణ్యంతో కలసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచాల్సిన అవసరం ఉందన్నారు. చెట్లు లేకపోవడంతోనే వర్షాలు కురవడం లేదని, వేడి ఎక్కువ ఉందన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ దేవరి, హెచ్‌ఎం రమణయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ హేమవతి, తదితరులు పాల్గొన్నారు.

యాత్రికులతో మర్యాదగా వ్యవహరించాలి


మాట్లాడుతున్న సీఐ జయచంద్ర

రేణిగుంట: రైల్వేస్టేషన్ ఆవరణలో ఆటోస్టాండ్, సుమో స్టాండ్ డ్రైవర్లతో అర్బన్ సీఐ జయచంద్ర శనివారం సమావేశమయ్యారు. తిరుమల తిరుపతికి ముఖద్వారమైన రేణిగుంట రైల్వే జంక్షన్‌కు దేశ నలుమూలల నుంచి యాత్రికులు వస్తుంటారని, వారితో మర్యాదగా నడుచుకోవాలని సీఐ సూచించారు. రాబోయే తిరుమల బ్రహ్మోత్సవాల్లో అధిక చార్జీలు వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ భక్తులకు ఇబ్బందులు కలిగించకూడదని స్పష్టం చేశారు.

ముక్కంటి సేవలో ప్రముఖులు


ఆలయం వద్ద కేరళ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బసంత్ బాలాజీ

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామివారిని శనివారం పలువురు ప్రముఖులు వేర్వేరుగా దర్శించుకున్నారు. కేరళ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బసంత్ బాలాజీ కుటుంబ సమేతంగా, జమ్ముకాశ్మీర్‌కు చెందిన శారదా శార్వగ్య పీఠం పీఠాధిపది జగద్గురు అనంత్ స్వామి అమృతానందదేవ్ తీర్థజీ మహరాజ్ తన శిష్యబృందంతో కలిసి దర్శించుకున్నారు. ఆలయ దక్షిణ గోపురం వద్ద ఈఓ బాపిరెడ్డి, ఆలయాధికారులు వారికి సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించి, స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ మోహన్, విద్యాసాగర్, పర్యవేక్షకులు నాగభూషణం, ఇన్‌స్పెక్టర్ వెంకటస్వామి, ఏపీఆర్వో రవి పాల్గొన్నారు.

జిల్లాస్థాయి పోటీల్లో కారిపాకం విద్యార్థుల ప్రతిభ


జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన కారిపాకం హైస్కూల్ విద్యార్థులు

వరదయ్యపాళెం: తిరుపతి ఎస్వీ క్యాంపస్ హైస్కూల్‌లో సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో వారధి ఫౌండేషన్ వారు నిర్వహించిన పోటీల్లో కారిపాకం హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. విద్యార్థులు అభ్యాసనాభివృద్ధిలో సోషల్ మీడియా పాత్ర అనే అంశంపై జరిగిన చర్చా వేదికలో పాఠశాలకు చెందిన మహాశ్వేత, ప్రణతి, జోషిక, మునిరోహిత రెండో స్థానం సాధించారు. వ్యాస రచన పోటీల్లో ముని తేజశ్రీ, పవన్, బాలకృష్ణ తృతీయ స్థానం సాధించారు. జిల్లాస్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పాఠశాల హెచ్‌ఎం రవీంద్రారెడ్డి, వారికి గైడ్‌గా వ్యవహరించిన పూడి శ్రీనివాస్ యాదవ్, మనోహర్, ఉపాధ్యాయులు దుష్యంత్ రెడ్డి, వెంకటరమణ, మీరయ్య, మునెమ్మ, ఏడుకొండలు, వెంకటేశ్వర్లు, కుమార్‌లు అభినందనలు తెలిపారు.

నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి


మాట్లాడుతున్న ఏడీఏ సుబ్రమణ్యం

వరదయ్యపాళెం: రానున్న సీజన్‌లో రైతులకు యూరియా పంపిణీ విషయమై ప్రభుత్వ నిబంధనలను డీలర్లు తప్పక పాటించాలని సత్యవేడు ఏడీఏ సుబ్రమణ్యం సూచించారు. శనివారం వరదయ్యపాళెంలోని వ్యవసాయశాఖ కార్యాలయంలో డీలర్లతో ఆయన సమీక్షించారు. యూరియా అవసరమైన రైతు భూమి పాసు పుస్తకం, ఆధార్ కార్డు తప్పనిసరిగా తీసుకురావాలని, అలాగే ఎకరాకు విడతల వారీగా 3 బస్తాలకు మించి ఇవ్వకూడదన్నారు. అలాగే ఒక షాపులో తీసుకున్న రైతు మరో షాపులో తీసుకోకూడదని, అందుకు సంబంధించి వివరాలు తెలిసేలా డీలర్లకు ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తేనున్నట్లు తెలిపారు. అలాగే ప్రైవేటు దుకాణాల్లో రోజువారీ యూరియా అమ్మకాల వివరాలను సంబంధిత డీలర్లు మండల వ్యవసాయశాఖ అధికారికి తెలియజేయాలన్నారు. మరో వారం రోజుల్లో రైతు సేవా కేంద్రాల్లో యూరియా అందుబాటులో ఉండేలా ప్రభుత్వానికి ఇండెంట్ ఇవ్వనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఓ గౌరి, ఏఈఓ ప్రవీణ్, క్షేత్రస్థాయి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతలకు అ'పూర్వ' సన్మానం


ఉత్తమ టీచర్లను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

తొట్టంబేడు: అవార్డు గ్రహీతలను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. తొట్టంబేడు మండలం దిగువ సాంబయ్యపాళెం ఫౌండేషన్ స్కూల్‌లో పని చేస్తున్న కయ్యూరు బాలసుబ్రహ్మణ్యంకు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు, వరదయ్యపాళెం మండలం ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలికి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు వచ్చింది. ఈ నేపథ్యంలో 1987–88 పదో తరగతి విద్యార్థులు తొట్టంబేడు జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీతలు మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు తమను సన్మానించడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో శివ, విజయ్ కుమార్, ప్రదీప్, హరీష్, నాగ శేషు, రాజశేఖర్, బాల, ప్రసాద్ స్వామి, మధు, యాసిన్, శ్రీవత్సవ్, శ్రీధర్, వెంకటకృష్ణ, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

రేణిగుంటలో స్వచ్ఛాంధ్ర ర్యాలీ



కరకంబాడిలో ర్యాలీ చేస్తున్న ప్రభుత్వ అధికారులు, విద్యార్థులు

రేణిగుంట: పంచాయతీలో శనివారం స్వచ్ఛాంధ్ర ర్యాలీ నిర్వహించారు. ప్రతి నెలా మూడో శనివారం రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న స్వర్ణాంధ్ర –స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా రేణిగుంట మండలంలో శనివారం గ్రీన్ స్టేట్ కార్యక్రమం నిర్వహించారు. రేణిగుంట పంచాయతీలో ఎంపీడీఓ రవిచంద్ర, డిప్యూటీ ఎంపీడీఓ ప్రభురావు, ఎంఈఓలు ఇందిరాదేవి, రంగనాథయ్య, ఈఓ మాధవి, సర్పంచ్ నగేషం అధికారులతో కలిసి పంచాయతీ కార్యాలయం నుంచి బస్టాండ్ కూడలి వరకు ర్యాలీ చేశారు. పంచాయతీ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. కరకంబాడి జెడ్పీ హైస్కూల్ ఆవరణలో డిప్యూటీ ఎంపీడీఓ ప్రభురావు, కార్యదర్శి రమేష్ బాబు, ప్రధానోపాధ్యాయురాలు పుష్పలత విద్యార్థులతో కలిసి గ్రామంలో అవగాహన ర్యాలీ చేపట్టారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు.

వీఆర్ఏ సమస్యలను వెంటనే పరిష్కరించాలి


నిరసన తెలుపున్న వీఆర్ఏలు

శ్రీకాళహస్తి: వీఆర్ఏల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి జనమాల గురవయ్య డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్త ఆందోళనలో భాగంగా శనివారం ఏఐటీయూసీ అనుబంధ సంఘమైన ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం ఆర్డీఓ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అనంతరం ఆర్డీఓ భానుప్రకాష్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. గురవయ్య మాట్లాడుతూ వీఆర్ఏ సమస్యలు చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్నాయని, గతంలో కూడా పెద్దఎత్తున ఆందోళన నిరసన కార్యక్రమాలు చేశామన్నారు. ఈ నెల 22వ తేదీన కలెక్టరేట్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతామన్నారు. అర్హులకు ఉద్యోగోన్నతులు కల్పించి కారుణ్య నియామకాలు చేపట్టాలన్నారు. కనీస వేతనం రూ. 26 వేలు, ఈఎస్ఐ, పీఎఫ్‌తో కూడిన సదుపాయాలు కల్పించాలని కలెక్టర్ చేతుల మీదుగా గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళనలు చేస్తామన్నారు.

రోడ్లు బాగు చేయండి సారూ!


వినతిపత్రం అందజేస్తున్న స్థానికులు

రేణిగుంట: మండలంలోని కరకంబాడి పంచాయతీ తారకరామనగర్‌లో రోడ్లు అధ్వాన్నంగా ఉన్నాయని, వాటిని బాగు చేయాలని కోరుతూ శనివారం పంచాయతీ కార్యదర్శికి స్థానికులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్లాట్ నంబర్ 3,028 నుంచి 3,039 వరకు రోడ్డు చాలా అధ్వాన్నంగా ఉందని, వీధిలో నడవలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఆ రోడ్డు బాగు చేయాలని విజ్ఞప్తి చేశారు. అధికారులు స్పందించి వెంటనే రోడ్డు బాగు చేయాలని కోరారు.

సమానత్వం కోసం సమరశీల పోరాటాలు


సమావేశమైన ఐద్వా మహిళలు

తొట్టంబేడు: సమాజంలో నేటికీ స్త్రీ సమానత్వానికి నోచుకోలేదని, పురుషాధిపత్య భావజాలం అసమానతలు పెంచుతూనే ఉందని, దానికి వ్యతిరేకంగా సమరశీల ఉద్యమాలు చేయాలని ఐద్వా జిల్లా కార్యదర్శి సాయిలత పిలుపు నిచ్చారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవన్‌లో శనివారం ఐద్వా శ్రీకాళహస్తి ప్రాంతీయ మహా సభ నిర్వహించారు. సాయిలత మాట్లాడుతూ ప్రజాస్వామ్యం, సమానత్వం, స్త్రీ విముక్తి లక్ష్యంగా ఐద్వా పనిచేస్తుందని తెలిపారు. స్వాతంత్రానికి పూర్వం మహిళలు ఇంటి నుంచి బయటకు రాలేని కాలంలో సామాజిక సమస్యలు, మూఢ విశ్వాసాలు, సనాతన సంప్రదాయాలకు వ్యతిరేకంగా అనేకమంది మహిళా నేతలు విరోచిత పాత్ర పోషించారన్నారు. బాల్య వివాహాలు, వరకట్న దురాచారం, మహిళలపై జరుగుతున్న హింస దాడులు అరికట్టాలని, విద్య ఉద్యోగ, రాజకీయాల్లో మహిళలకు సమాన అవకాశాలు దక్కే వరకు పోరాటాలు సాగించాలని సూచించారు. అనంతరం ఐద్వా శ్రీకాళహస్తి ప్రాంతీయ నూతన కమిటీని శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా రాధమ్మ, కార్యదర్శిగా లతారెడ్డి, ఉపాధ్యక్షులుగా కమలమ్మ, సహాయ కార్యదర్శిగా కేశవమ్మ, సభ్యులుగా ఆరుగురు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణ తగదు

బుచ్చినాయుడుకండ్రిగ: మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ తగదని, ఇది దారుణమని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఉగ్గుమూడి గురునాథం విమర్శించారు. శనివారం విలేకరులతో మాట్లాడుతూ పేద ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలన్న మంచి ఉద్దేశంతో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో 17 ప్రభుత్వ కళాశాలలను ఏర్పాటు చేశారన్నారు. నిర్వహణ చేతకాని చంద్రబాబు ఆ కళాశాలలను పీపీపీ పద్ధతిన తమ అనుయాయులకు కట్టబెట్టేందుకు చూస్తున్నారని ఆరోపించారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే విద్యార్థుల సమస్యలను పరిష్కరిస్తామని హామీలిచ్చిన విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రస్తుతం వాటిని అమలు చేయకుండా విద్యార్థులను దారుణంగా మోసం చేస్తున్నారన్నారు.